

నాట్య మయూరాలు 8లో▸

శాస్త్రీయ నృత్యంలో రాణిస్తూ ప్రత్యేకత చాటుతున్నారు బాలకేంద్రం చిన్నారులు. కూచిపూడిలో గిన్నిస్‌రికార్డులో స్థానం దక్కించుకున్నారు.



పంచ్ అదుర్స్! 8లో▸

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు మంచిర్యాల వేదికగా నిలిచింది. ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ శాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా జీపీవో రాత పరీక్ష



పరీక్ష తీరు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: గ్రామ పాలన అధికారుల (జీపీవో) నియామకం కోసం ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణ శివారులోని నలంద డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 83 మంది హాజరుకావాల్సి ఉండగా 73 మంది హాజరయ్యారు. పది మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రంలోకి అనుమతించారు. కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. నిర్వహణ తీరుపై ఆరా తీశారు.

‘డీసెట్’కు 12 మంది గైర్హాజరు

కైలాస్‌నగర్: డీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన డీసెట్ ప్రశాంతంగా ముగిసింది. పట్టణ శివారులోని నలంద డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించినసెషన్‌లో 101 మందికి గాను 95 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 100మందికి గాను 94 మంది హాజరయ్యారు. మొత్తం 12 మంది గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

‘అరుణ’కు సత్కారం



సత్కారం అందుకుంటున్న అరుణ బట్టువార్

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్ సాహితీవేత్తగా అందించిన సేవలకు గాను తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పరిషత్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం బాలసాహిత్య సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖుల చేతుల మీదుగా ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం అరుణ బట్టువార్ విద్యార్థుల కోసం రచించిన ‘ఆకుపచ్చని కథలు’ పుస్తకాన్ని కేంద్రసాహిత్య అకాడమీ గ్రహీత పత్తిపాక మోహన్, ఏలూరి శివారెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ సెక్రెటరీ డాక్టర్ డి చెన్నయ్య, ప్రముఖ బాల సాహితీవేత్త అశోక్, డాక్టర్ వీఆర్ శర్మ తదితరుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పుస్తకం విద్యార్థులను ఎంతోగానో ఆకట్టుకుంటుందని వారు ప్రశంసించారు.

నకిలీ విత్తన విక్రయాలపై నిఘా పెంచాలి



మాట్లాడుతున్న బొర్రన్న

ఇచ్చోడ: గ్రామాల్లో అమాయక రైతులను ఆసరగా చేసుకొని నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఇచ్చోడలో రైతులుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొంత మంది వ్యాపారులు గ్రామాల్లో అమాయక రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నరని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, పోలీసు శాఖలు గ్రామాల్లో మరింత నిఘా పెంచి తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆయన వెంట రైతులు అనిల్, మోహన్, మాణిక్‌రావు, సలీం తదితరులు ఉన్నారు.

నైరుతి ఆగమనానికి ముందే రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమయ్యారు. తొలకరి పలకరించక ముందే దుక్కి పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవల కురిసిన ముందస్తు వర్షాల నేపథ్యంలో ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామంలో రైతులు ఇలా పంట చేనును సిద్ధం చేస్తున్నారు. మంచి రోజు చూసి విత్తనాల కొనుగోలు చేపట్టనున్నట్లు చెబుతున్నారు. అయితే పూర్తిస్థాయిలో వర్షాలు కురిశాకే విత్తుకోవడం మేలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



సాగుకు సిద్ధం

- మంచిరోజు కోసం ఎదురుచూపు
- విత్తన కొనుగోలుకు అన్నదాత సెంటిమెంట్
- ముందస్తు వర్షాలు.. అందిన నైరుతి కబురు
- వానాకాలం సీజన్‌కు రైతులు సర్వం సన్నద్ధం



విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు (ఫైల్)

ఆదిలాబాద్‌అర్బన్: ముందస్తు వర్షాలు.. నైరుతి ఆగమన కబురు నేపథ్యంలో జిల్లాలోని రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమయ్యారు. పత్తితో పాటు ఇతర పంటల విత్తనాల కొనుగోలుకు మంచి రోజు కోసం ఎదురు చూస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా ఈ సారి విత్తనాల ఎంపిక విషయంలో ఆచీతూచి వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు కొనుగోలు చేయగా, శుభఘడియలు రాగానే కొనేందుకు మిగతా వారు సిద్ధమవుతున్నారు.

పత్తి విత్తనాలపై ఫోకస్..

వానాకాలం సీజన్‌కు సంబంధించి వ్యవసాయశాఖ అన్ని రకాల విత్తనాలు సిద్ధం చేసింది. జిల్లాకు సరఫరా అయిన విత్తనాలను ఆయా మండలాలు, గ్రామాల వారీగా రైతులకు అందుబాటులో ఉంచింది. జిల్లాలో పత్తి సాగు ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో ఆ విత్తనాలపై ఎక్కువ ఫోకస్ పెంచింది. మరో వారం రోజుల్లో వానాకాలం పనులు ఊపందుకోనున్న తరుణంలో విత్తనపరంగా ఎలాంటి లోటు రానియ్యకుండా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆయా లైసెన్స్‌డ్ దుకాణాల్లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచి రైతులకు మాత్రమే విక్రయించేలా దృష్టి సారించింది.

అందుబాటులో 13.15 లక్షల విత్తన ప్యాకెట్లు

జిల్లాలోని రైతులకు ఈసారి పత్తి విత్తన సమస్య తలెత్తకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. గతంలో విత్తనాలు దొరక్క దుకాణాల ఎదుట భారీ క్యూలైన్లు, షాపుల ముందు రైతుల పడిగాపులు, నకిలీ విత్తనాల సరఫరా, ప్రైవేట్ వ్యాపారుల మాయాజాలం వంటి ఘటనలు పునరావృతం కాకుండా అప్రమత్తమైంది. ఈ సారి ముందుగానే సరిపడా మించి విత్తనాలు అందుబాటులో ఉంచింది. జిల్లాలోని 297 దుకాణాల్లో 13.15 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. ఇందులో అత్యధికంగా ఆదిలాబాద్ అర్బన్‌లో అత్యల్పంగా మావల మండలంలో ఉన్నాయి.

అందుబాటులో ఉంచాం..



రైతులకు సరిపడా పత్తి విత్తనాలు అందుబాటులో ఉంచాం. డిమాండ్ మేరకు అన్ని రకాల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. అయితే పూర్తిస్థాయిలో వర్షాలు కురిశాకే విత్తుకోవడం మేలు. – శ్రీధర్ స్వామి, జిల్లా వ్యవసాయ అధికారి

మండలాల వారీగా అందుబాటులో ఉన్న పత్తి విత్తనాల ప్యాకెట్లు..

మండలం	దుకాణాలు	ప్యాకెట్లు
ఆదిలాబాద్‌రూరల్	04	1487
ఆదిలాబాద్‌అర్బన్	69	631945
బజార్‌హత్నూర్	07	8320
బేల	31	182887
భీంపూర్	09	11499
భోరజ్	03	559
బోథ్	17	70211
ఇచ్చోడ	24	121605
గాదిగూడ	06	18735
గుడిహత్నూర్	11	15302
ఇంద్రవెల్లి	21	64834
జైనథ్	10	4521
మావల	01	325
నార్నూర్	11	27850
నేరడిగొండ	13	49173
సాత్నాల	03	3017
సిరికొండ	04	11928
సొనాల	06	10549
తలమడుగు	16	29455
తాంసి	14	22209
ఉట్నూర్	16	29340

అప్రమత్తత అవసరం

- మార్కెట్లో నకిలీల బెడద
- ఎరువులు, విత్తనాలపై అవగాహన తప్పనిసరి

నేరడిగొండ: ఖరీఫ్ సీజన్ షురూ కానున్న నేపథ్యంలో మార్కెట్‌లో నకిలీల బెడద ఎక్కువగా ఉన్నందున కర్షకులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. విత్తనాలు, ఎరువుల కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి వివరించారు.

విత్తన కొనుగోళ్లలో..

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. అందులో విక్రయదారుడి పేరు, సంతకం, రైతు పేరు, విత్తనరకం, బ్యాచ్ నంబర్, గడువు తేదీ, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయోలేదో సరిచూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనవద్దు.
- బిల్లులను పంటకాలం పూర్తయ్యేంత వరకు దాచి పెట్టుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసి ఇంటికి తెచ్చిన తర్వాత మొలక శాతాన్ని చూసుకోవాలి. సంతప్తికరంగా ఉంటేనే విత్తుకోవాలి.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువులు కొనేముందు..

- అధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే కొనాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో సరిచూసుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ పేరు ఉంటేనే కొనాలి.
- చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలను కొనవద్దు. అన్యపదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయాధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి.

ఎస్‌హెచ్‌జీలకు అదనపు ఉపాధి

- స్కూల్ యూనిఫాం కుట్టు బాధ్యత వారికే ..
- పట్టణంలో 256 మంది సభ్యుల ఎంపిక
- జూన్ 2లోగా దుస్తులు అందించేలా ఆదేశం

కైలాస్‌నగర్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం ప్రత్యేకంగా మహిళాశక్తి పథకాన్ని అమలు చేస్తోంది. అలాగే గతేడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమైన యూనిఫాం కుట్టించే బాధ్యత కూడా వారికే అప్పగిస్తోంది. తద్వారా అదనపు ఉపాధి సమకూరుతుంది.

గతేడాది నుంచి కుట్టు బాధ్యతలు..

సర్కారు బడి విద్యార్థులకు అవసరమైన యూనిఫాంను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న విషయం తెలిసిందే. గతంలో వీటిని కుట్టించే బాధ్యతలను రాష్ట్రస్థాయిలోని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించేవారు. ఆ దుస్తులు కొలతలకు అనుగుణంగా లేకపోవడంతో విద్యార్థులకు అసౌకర్యంగా ఉండేది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక దీనిని గుర్తించింది. స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన స్కూల్ యూనిఫాం కుట్టే బాధ్యతలను గతేడాది నుంచే వారికే అప్పగించింది. దుస్తులు కుట్టేందుకు అవసరమైన బట్టను ప్రభుత్వమే అందజేస్తోంది. విద్యా సంవత్సరం ముగింపులో పాఠశాలల వారీగా విద్యార్థుల కొలతలు సేకరించిన ఎస్‌హెచ్‌జీ సభ్యులు బట్ట అందిన కొద్దీ దుస్తులు కుడుతన్నారు. ఒక్కో జతకు వారికి రూ.75 చొప్పున ప్రభుత్వం కూలీ చెల్లిస్తోంది. స్వయం ఉపాధి రుణాల సద్వినియోగంతో వివిధ వ్యాపారాలు, స్వయం ఉపాధి పొందుతున్న మహిళలకు దీని ద్వారా అదనపు ఉపాధి లభిస్తోంది.



దుస్తులు కుడుతున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు

68 పాఠశాలలు..10వేల విద్యార్థులు


ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో 68 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 10,786 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో బాలురు 4813 మంది, బాలికలు 5973 మంది ఉన్నారు. వీరందరికీ ఏడాదికి గాను ప్రభుత్వం రెండు జతల యూనిఫాం అందజేస్తోంది. వీటిని కుట్టించేందుకు గాను పట్టణంలోని 68 స్లమ్ లెవల్ ఫెడరేషన్లను ఎంపిక చేశారు. 258 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులను గుర్తించి వారికి కుట్టు బాధ్యతలు అప్పగించారు. కొంతమంది తమ టైలరింగ్ దుకాణాల్లో దుస్తులు కుడుతుండగా మరికొంతమంది తమ ఇళ్ల వద్దే స్టిచింగ్ చేస్తున్నారు. బడులు తెరిచే నాటికి ప్రతీ విద్యార్థికి యూనిఫాం అందించాలని జిల్లా అధికారులు సంకల్పించారు. జూన్ 2 నాటికి కనీసం ఒక జతను అందించేలా ఆదేశాలు జారీ చేశారు. ఆ దిశగా సభ్యులు తమ పనిలో నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ పర్యవేక్షించేందుకు గాను మెప్మా పరిధిలోని ఐదుగురు సీవోలకు బాధ్యతలు అప్పగించారు.

ప్రభుత్వ నిర్ణయం ప్రయోజనకరం



ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన యూనిఫాం కుట్టించే బాధ్యతను ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు అప్పగించడం ఎంతో హర్షనీయం. అవసరమైన బట్టను ప్రభుత్వమే మాకు సరఫరా చేసింది. దీంతో ఇంటి వద్దే దుస్తులను కుడుతున్నా. ప్రభుత్వ నిర్ణయంతో మాకు అదనపు ప్రయోజనం చేకూరనుంది. – రాణి, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, హౌసింగ్‌బోర్డు

ఆర్థికంగా ముందుకు సాగుతున్నాం..



ప్రభుత్వం నుంచి బ్యాంకు లింకేజీతో పాటు స్త్రీనిధి రుణాలు పొందుతున్నాం. వాటి ద్వారా చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ముందుకు సాగుతున్నాం. విద్యార్థులకు అవసరమైన యూనిఫాం కుట్టించే బాధ్యతను ప్రభుత్వం మాకు అప్పగించడంతో అదనపు ఉపాధి లభించింది. అయితే ప్రస్తుతం ఒక్కో జతకు రూ.75మాత్రమే చెల్లిస్తోంది. మార్కెట్ ధరకనుగుణంగా కూలీ రేటు పెంచితే బాగుంటుంది. – షభానా, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, కేఆర్‌కే కాలనీ

రిజిస్ట్రేషన్ ఇక సులభతరం



ఆదిలాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన జనం (ఫైల్)

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్
- జూన్ 2 నుంచి అమలుకు సర్కారు నిర్ణయం
- ప్రజలకు సత్వర సేవలే లక్ష్యం

కైలాస్‌నగర్: రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి కార్యాలయాల్లో నిరీక్షించాల్సిన అవసరం ఇకపై ఉండదు. ఆస్తుల రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తెస్తోంది. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానం విజయవంతం కావడంతో జూన్ 2నుంచి అన్ని చోట్ల అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలో రెండు చోట్ల ఇకపై స్లాట్ బుకింగ్ ద్వారానే రిజిస్ట్రేషన్లు కానున్నాయి. ఈ మేరకు ఆ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో రెండు చోట్ల..

జిల్లాలో ఆదిలాబాద్, బోథ్‌లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటి ద్వారానే ప్లాట్లు, ఇళ్లు వంటి ఆస్తుల క్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. జిల్లా కేంద్రంలో రోజుకు సగటున 50 నుంచి 60 వరకు ఉండగా, బోథ్‌లో నెలకు 30 నుంచి 40 ఉంటున్నాయి. రిజిస్ట్రేషన్ సమయంలో డాక్యుమెంట్లపై అమ్మిన వారు, కొన్నవారు, సాక్ష్యులు, సబ్‌రిజిస్ట్రార్ వ్యక్తిగతంగా సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు చాలా సమయం పడుతుండటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆలస్యమవుతుంది. ఫలితంగా ప్రజల సమయం వృథా అవడంతో పాటు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీన్ని నివారించాలని భావించిన ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని సంకల్పించింది. ఇందుకోసం ఆధార్–ఈ సంతకం అమలు చేసేందుకు కూడా సిద్ధమవుతుంది. తద్వారా జాప్యం లేకుండా ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయవచ్చని భావిస్తోంది.

సేవల్లో వేగవంతం..

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సేవలు వేగవంతంగా పారదర్శకంగా అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం స్లాట్ బుకింగ్ విధానానికి శ్రీకారం చుట్టింది. పైలట్ ప్రాజెక్టుగా పలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఏప్రిల్ 10నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అక్కడ విజయవంతం కావడంతో జూన్ 2నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని భావిస్తోంది. ఇకపై 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

రోజుకు 48 స్లాట్లు..

నూతన విధానం ద్వారా రోజుకు ఒక్కో సబ్‌రిజిస్ట్రార్‌కు 48 స్లాట్లుగా నిర్ణయించారు. ఉదయం 24, మధ్యాహ్నం 24 డాక్యుమెంట్లు చేసేలా వాటిని విభజించారు. రిజిస్ట్రేషన్ కోసం ముందుగా registration. telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. తద్వారా వేచి చూడాల్సిన అవసరం లేకుండా నిర్దేశిత సమయంలో ప్రక్రియ పూర్తి చేసుకునే అవకాశముంటుంది. ఆలస్యమైతే మాత్రం మరుసటి రోజు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఏదైనా అత్యవసర సమయంలో సాయంత్రం ఐదు గంటల తర్వాత ఐదు అదనపు రిజిస్ట్రేషన్లను స్లాట్‌తో సంబంధం లేకుండా చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ఇంకా ఆదేశాలు రాలేదు



రిజిస్ట్రేషన్ల ప్రక్రియను స్లాట్ బుకింగ్ విధానంతో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 2నుంచి అమలు చేయాలని భావిస్తోంది. అయితే అధికారికంగా ఇంకా మాకు ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా జిల్లాలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – విజయ్‌కాంత్‌రావు, జాయింట్–1 సబ్‌రిజిస్ట్రార్, ఆదిలాబాద్

జాతీయ సమగ్రతకు పాటుపడాలి

- ఎంపీ గోడం నగేశ్

ఇచ్చోడ: జాతీయ సమగ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను హర్షిస్తూ మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన తిరంగా ర్యాలీకి హాజరయ్యారు. హనుమాన్ సాయి ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ శివాజీచౌక్, అంబేద్కర్ చౌక్‌లు మీదుగా కొనసాగింది. ఇందులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మనంద్, ఆడె మానాజీ, గుమ్మడి భీంరెడ్డి, మాధవ్ రావు అమ్డే, ముస్తాపురే అశోక్, చంద్రశేఖర్, బాబారావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ నగేశ్, తదితరులు

‘మన్‌కీ బాత్’ వీక్షించిన ఎంపీ

గుడిహత్నూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఎంపీ గోడం నగేశ్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యకర్త జాదవ్ రాజేంద్రప్రసాద్ ఇంట్లో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశ సైనికుల్లో ఆత్మస్థైర్యం పెరిగిందన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మనంద్, పార్టీ మండలాధ్యక్షుడు శివ తదితరులున్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 163 మందికి వృత్తిపరమైన శిక్షణ

కైలాస్‌నగర్: జిల్లాలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల వృత్తిపరమైన శిక్షణకు సర్వం సిద్ధమైంది. ప్రభుత్వం మొదటి బ్యాచ్‌గా ఎంపిక చేసిన 163 మందికి జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో 50 రోజుల పాటు ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఇందుకోసం ఆ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10గంటలకు అభ్యర్థులు కేంద్రంలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. సర్టిఫికెట్ల పరిశీలన కోసం ప్రత్యేకంగా నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు తమ విద్యార్హతకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ ప్రతులు, మీ సేవకేంద్రం దరఖాస్తు రశీదు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు. అభ్యర్థులను రెండు బ్యాచ్‌లుగా విభజించనున్నారు. కొందరికి ఉదయం తరగతులు నిర్వహిస్తారు. మరి కొంతమందికి క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రత్యక్షంగా శిక్షణ ఇస్తారు. సర్వేకు సంబంధించిన గొలుసులు, క్రాస్‌స్టాప్, క్యాలికులేటర్, స్కేల్, పెన్సిల్, నోట్ బుక్‌తో పాటు స్టడీ మెటిరియల్ అందించనున్నారు. ఈ సామగ్రి అంతా ఇప్పటికే జిల్లాకు చేరుకుంది. కాగా, ఏర్పాట్లను జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్ పరిశీలించారు. శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని రాణించాలని ఆయన సూచించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏడీ రాజేందర్

క్లుప్తంగా

ఐచర్ వ్యాన్ బోల్తా

ఇచ్చోడ: మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు ఐచర్ వ్యాన్ కాలువలో బోల్తాపడింది. గోదాంల నుంచి ఐచర్ వ్యాన్ రోడ్డుపై వస్తుండగా కల్వర్టుపై ఉన్న మట్టి కూలడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో డ్రైవర్ చాకచాక్యంగా ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

నిర్మల్‌లో దొంగల హల్‌చల్

నిర్మల్‌టౌన్: పట్టణంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పలు దుకాణాల్లో చొరబడి నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం షాపులకు వెళ్లిన యజమానులకు షటర్ల తాళాలు పగులగొట్టి ఉండడంతో షాకయ్యారు. స్థానిక బస్టాండ్ ప్రాంతంలోని ఓ కిరాణాషాపులో రూ.60 వేల నగదును ఎత్తుకెళ్లారు. బస్టాండ్ ఏరియాలోని ఓ మెడికల్ షాపులో, ఈద్గా చౌరస్తాలోని మరో మెడికల్ షాపులో నగదు ఎత్తుకెళ్లారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. చోరీపై కేసు దర్యాప్తు చేపట్టారు.

వైన్స్‌లో చోరీ

ముథోల్: స్థానిక శ్రీరాజరాజేశ్వర వైన్స్‌లో చోరీ జరిగింది. ప్రతీరోజు మాదిరిగా శనివారం రాత్రి వైన్స్‌కి యజమాని తాళం వేసి వెళ్లారు. ఆదివారం ఉదయం వైన్స్ షాపు తెరవగా వెనుక భాగంలో రేకులు తొలగించి ఉంది. రూ.2.56 లక్షల విలువ గల మద్యం, రూ.19 వేల నగదుతోపాటు సీసీటీవీ డీవీఆర్‌ను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. యజమాని వెంటనే సమాచారమివ్వడంతో సీఐ మల్లేశ్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బంది వివరాలు సేకరించారు.

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

ఇచ్చోడ: నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపుతామని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ అన్నారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లాలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతామన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఈమేరకు వివరాలు వెల్లడించారు. ఇచ్చోడ ఏవో రమేశ్ ఫిర్యాదుతో శనివారం సాయంత్రం జాదవ్ గజానంద్ ఇంటిపై పోలీసులు దాడి నిర్వహించగా, 9 తిలక్ 5జీ నకిలీ విత్తన ప్యాకెట్లు లభించాయి. అతన్ని విచారించగా కోకస్‌మన్నూర్‌కు చెందిన ఇద్దరు విక్రయించారని చెప్పాడు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ గ్రామానికి వెళ్లి కె.శివకుమార్, కొతపల్లి రవీందర్ నుంచి విక్రాంత్–44కు సంబంధించి 39 నకిలీ విత్తన ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరిని అరెస్టు చేశారు. మళ్లీ జాదవ్ గజానంద్‌ను విచారించగా ముక్రా(బి)కి చెందిన ఆదవ్ రవికాంత్ నుంచి నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. రవికాంత్ మహారాష్ట్ర నుంచి నకిలీ విత్తనాలు తీసుకువచ్చి గజానంద్ ద్వారా రైతులకు విక్రయిస్తున్నారని ఏఎస్పీ పేర్కొన్నారు. ప్రస్తుతం రవికాంత్ పరారీలో ఉన్నారని తెలిపారు. ఈ నలుగురిపై ఇచ్చోడలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పంచ్ అదుర్స్!

- మంచిర్యాలలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు
- 260 మంది క్రీడాకారులు హాజరు..
- హోరాహోరీగా తలపడుతున్న బాక్సర్లు



విజేతను ప్రకటిస్తున్న ఎంపైర్



బాక్సింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రం రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు వేదికగా నిలిచింది. ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ (బాక్సింగ్ ఫెడరేషన్ అనుబంధం) పర్యవేక్షణలో ఈనెల 24న ప్రారంభమైన ఈ పోటీలు 26 వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 260 మంది బాక్సింగ్ క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. వయస్సు, బరువు ఆధారంగా విభజించిన విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతూ శక్తివంతమైన పంచ్‌లతో ఆకట్టుకుంటున్నారు.

టైసన్ బాక్సింగ్ క్లబ్ ఏర్పాట్లు

పోటీలను తిలకించేందుకు పెద్దఎత్తున ప్రేక్షకులు తరలివస్తున్నారు. టైసన్ బాక్సింగ్ క్లబ్ క్రీడాకారులకు వసతి, ఇతర సౌకర్యాలు కల్పించి, లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు పాల్గొనడంతో పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించే వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా పలువురి క్రీడాకారులను 'సాక్షి'పలకరించగా తమ అనుభవాలు వెల్లడించారు.

నాలుగేళ్లుగా శిక్షణ



గత నాలుగేళ్లుగా బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నాను. 9వ తరగతి చదువుతున్నా నాకు ఎస్జీఎఫ్, ఓపెన్ స్టేట్ బాక్సింగ్ పోటీల్లో ఆడేందుకు అవకాశం వచ్చింది. ద్వితీయ, తృతీయ స్థానాలతోనే సరిపెట్టుకున్నాను. ప్రస్తుతం మంచిర్యాల ఖేలో ఇండియాలో బాక్సింగ్‌లో శిక్షణ పొందుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించడమే లక్ష్యంగా శిక్షణ పొందాను. హైదరాబాద్ వారితో ఈ పోటీల్లో గెలుపొందడం ఆనందంగా ఉంది. – ఎండీ ఉబైద్ ఖాన్, మంచిర్యాల

బాక్సింగ్‌లో రాణించాలి



మంచిర్యాల ఖేలో ఇండియా బాక్సింగ్ శిక్షణ పొందుతున్నాను. 9వ తరగతి చదువుతున్న తాను అండర్ 14–విభాగంలో ఎస్జీఎఫ్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. రాష్ట్రస్థాయి పోటీల్లో, ఓపెన్ స్టేట్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాను. ప్రస్తుతం జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లోనూ గోల్డ్‌మెడల్‌ను సాధిస్తాను. – అనురాగ్, మంచిర్యాల

బాక్సింగ్ అంటే ఇష్టం



బాక్సింగ్ అంటే చాలా ఇష్టం. ఇంటర్ ఫస్టియర్ పూర్తయింది. ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో రెండుసార్లు పాల్గొని ఒకసారి గోల్డ్, మరోసారి సిల్వర్ మెడల్స్ సాధించాను. జాతీయస్థాయిలో ఒకసారి పాల్గొన్నాను. రాష్ట్ర, జాతీయ స్థాయిలోని పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్‌ను సాధించాలనే లక్ష్యంతో వచ్చాను. – పి.పవన్, హైదరాబాద్

సత్తాచాటుతూ..



పదో తరగతి చదువుతున్న నాకు రాష్ట్ర, జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో శిక్షణ పొందుతున్నాను. నాలుగేళ్లుగా బాక్సింగ్‌లో శిక్షణ పొందుతూ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో రెండుసార్లు ఆడేందుకు అవకాశం రాగా, ఒకసారి గోల్డ్‌మెడల్ సాధించాను. జాతీయస్థాయిలో రెండుసార్లు ఆడేందుకు అవకాశం వచ్చింది. రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తాచాటి గోల్డ్‌మెడల్స్‌ను సాధిస్తాను. – జి.శ్రీనాథ్, మంచిర్యాల

మరోసారి సత్తా చాటుతా..



ఇటీవల పదో తరగతి పూర్తయింది. మంచిర్యాలలోని ఖేలో ఇండియా ద్వారా బాక్సింగ్‌లో రెండేళ్లుగా శిక్షణ పొందుతున్నాను. ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో రెండుసార్లు పాల్గొని సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించాను. సీఎంకప్ రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ పతకం సాధించగా, ఓపెన్ స్టేట్ బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచాను. జాతీయస్థాయిలో ఆడినా పతకం అందుకోలేకపోయాను. మంచిర్యాలలో నిర్వహిస్తున్న పోటీల్లో గోల్డ్ పతకం సాధిస్తాను. – క్రితి అగర్వాల్, మంచిర్యాల

జాతీయస్థాయిలో రాణిస్తా



ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఇటీవల టెన్త్ చదివాను. రాష్ట్రస్థాయిలో ఎస్జీఎఫ్‌లో రెండు గోల్డ్‌మెడల్స్ సాధించాను. బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీల్లో 46, 48 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్స్ సాధించాను. జాతీయస్థాయి పోటీల్లో నాలుగుసార్లు పాల్గొనగా ఒకసారి దేశంలోనే 8వ స్థానంలో నిలిచాను. జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించడమే లక్ష్యంగా శిక్షణ పొందుతున్నాను. – నిహారిక, నిజామాబాద్

గోల్డ్‌మెడల్ సాధిస్తా



రాష్ట్రస్థాయిలో సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో, ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్స్ సాధించాను. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, గోవాకు ఎంపికయ్యాను. పదోతరగతి ఇటీవల పూర్తి చేయగా, 8వ తరగతి నుంచే బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నా. జాతీయస్థాయిలో పాల్గొని గోల్డ్‌మెడల్‌ను సాధించాలనే లక్ష్యంతో శిక్షణ పొందుతున్నాను. – జె.అనుగ్రహ, హైదరాబాద్

జాతీయస్థాయిలో ఆడేందుకు శిక్షణ



ఇటీవల ఇంటర్ పూర్తయింది. నాలుగుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడి గోల్డ్‌మెడల్ సాధించాను. జాతీయస్థాయిలో ఒకసారి ఆడి, సెమీఫైనల్ చేరాను. ఫైనల్ చేరేలా శిక్షణ తీసుకుంటూనే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నా. జాతీయస్థాయిలో రాణించేలా బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నా. – సంస్కృతి, మంచిర్యాల

ఇంద్రాదేవి ఆలయంలో విత్తన పూజలు



ఇంద్రాదేవికి మొక్కుతున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: ఖరీఫ్‌సీజన్ నేపథ్యంలో ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు విత్తన పూజలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి విత్తన పూజలు చేశారు. అమ్మవారికి నవధాన్యాలతో నైవేద్యాలు సమర్పించారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పుష్కలంగా కురవాలని పంటలు బాగా పండాలని అమ్మవారిని మొక్కుకున్నారు. ఆలయ మహారాజ్ చహకటి సూర్యరావ్, ఆయా గ్రామాల ఆదివాసీలు ఉన్నారు.

108లో ప్రసవం



శిశువుతో కుటుంబ సభ్యులు, 108 సిబ్బంది

బెల్లంపల్లి: పురిటినొప్పులతో బాధపడుతున్న 8 నెలల గర్భిణికి 108 సిబ్బంది ఎంతో నేర్పుతో ఆదివారం ప్రసవం చేశారు. కుమురం భీం జిల్లాలోని భీమన్‌గూడ మారుమూల గిరిజన గ్రామానికి చెందిన ఆత్రం పోసుబాయికి పురిటినొప్పులు వచ్చాయి. ఆశ కార్యకర్త సహాయంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియాస్పత్రికి రెఫర్ చేయడంతో అక్కడికి తీసుకెళ్లారు. 8 నెలల గర్భిణి, రక్తం తక్కువగా ఉండటం, ఐదో కాన్పు కావడంతో అక్కడి వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. వెంటనే పోసుబాయిని మంచిర్యాల మాతా శిశు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా సోమగూడెం శివారుప్రాంతంలో ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. రోడ్డు పక్కన అంబులెన్స్‌ను నిలిపి ఈఆర్‌సీపీ వైద్యుడి సలహాతో ఈఎంటీ దుర్గం ఆత్మరావు, పైలెట్ అజయ్ ఆమెకు నార్మల్ డెలివరీ చేయగా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఆరోగ్యంగా ఉన్నారు. వారిని మంచిర్యాల మాతా శిశు కేంద్రానికి తరలించారు. బెల్లంపల్లి 108 అంబులెన్స్ ఈఎంటీ, పైలెట్‌ను కుటుంబీకులు, ఆసుపత్రి సిబ్బంది అభినందించారు.

సీనియర్ జర్నలిస్ట్ మునీర్ మృతి



మునీర్(ఫైల్)



నివాళులర్పిస్తున్న టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు దేగ సత్యం, సభ్యులు

మందమర్రిరూరల్/పాత మంచిర్యాల: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎండీ మునీర్ (69) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆదివారం ఉదయం మృతిచెందారు. నెల రోజులుగా ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి కన్నుమూశారు. ఆయన పార్థివదేహాన్ని మంచిర్యాలలోని నివాసానికి తీసుకువచ్చారు. మధ్యాహ్నం వరకు సందర్శనార్థం అక్కడే ఉంచారు. పలువురు ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం పార్థివదేహాన్ని సాయంత్రం మందమర్రిలోని సీఈఆర్ క్లబ్ మీదుగా ఈద్గాకు తరలించారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్సీ కోదండరామ్, యూనియన్ నేతలు, స్నేహితులు, తోటి పాత్రికేయులు, రాజకీయనాయకులు, అభిమానులు నివాళులర్పించారు.

ఉద్యమకారుడిగా, జర్నలిస్ట్‌గా ప్రస్థానం

మునీర్ ఉద్యమకారుడిగా, జర్నలిస్ట్‌గా జిల్లాలో చెరగని ముద్రవేశారు. విద్యార్థి దశలో ఏఐఎస్‌ఎఫ్‌లో పనిచేసి, సీపీఐలో చురుకైన నాయకుడిగా ప్రజాపోరాటాల్లో పాల్గొన్నారు. 1981లో సింగరేణిలో కార్మికుడిగా చేరి, భూస్వాముల అరాచకాలపై పోరాటాలు చేశారు. 1982లో హత్య కేసులో నిందితుడిగా శిక్ష పొందినా, హైకోర్టు కేసును కొట్టివేసింది. ఇక జర్నలిస్టుగా వివిధ పత్రికల్లో 40 ఏళ్లు పనిచేశారు. 2008లో సింగరేణి గోల్డెన్ హ్యాండ్‌షేక్ పథకం ద్వారా ఉద్యోగ విరమణ పొంది, జర్నలిజంలో కొనసాగారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్‌గా సమ్మెను విజయవంతం చేశారు.

పలువురి నివాళి

మునీర్ మృతికి పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, కోనేరు కోనప్ప, ఐఎన్టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్‌ప్రసాద్ తదితరులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తంచేశారు. మునీర్‌కు భార్య రిజ్వానా, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ప్రాణ రక్షకులు

- ప్రమాద స్థలాలకు క్షణాల్లో చేరుతున్న పైలెట్లు
- క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు..
- వైద్య చికిత్సతో నిలబెడుతున్న ప్రాణాలు
- నేడు జాతీయ పైలెట్ దినోత్సవం



ఉమ్మడి జిల్లాలో..

జిల్లా	అంబులెన్సులు	పైలెట్
మంచిర్యాల	18	45
అదిలాబాద్	25	60
నిర్మల్	15	36
కుమురం భీం	15	35

చెన్నూర్: 108 అంబులెన్స్ పైలట్లు ప్రాణరక్షకులని.. ప్రమాదం జరిగిందని సమాచారం వస్తే చాలు క్షణాల్లో అక్కడికి చేరుకుంటారు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలిస్తున్నారు. సకాలంలో వైద్య చికిత్స అందించడంతో వారి ప్రాణాలను కాపాడగలుగుతున్నారు. పైలట్ల సేవలను పలువురు కొనియాడుతున్నారు. సోమవారం జాతీయ అంబులెన్స్ పైలెట్ దినోత్సవం సందర్భంగా సాక్షి కథనం.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 73 అంబులెన్స్‌లు పని చేస్తున్నాయి. 176 మంది పైలెట్లు విధులు నిర్వహిస్తున్నారు. అంబులెన్స్‌లు ఆయా మండలాల పరిధిలో జరిగే రోడ్డు, ఇతర ప్రమాదాలు జరిగిన సమయంలో సంఘటన స్థలాలకు చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. పైలెట్లు ప్రమాద స్థలాలకు చేరుకునేందుకు వారి ప్రాణాలను సైతం ఫణంగా పెడుతున్నారు.

ఉద్యోగం సంతృప్తినిస్తోంది



పైలెట్‌గా సుమారు 18 ఏళ్లుగా పని చేస్తున్నా. ఈ ఉద్యోగం కత్తిమీద సాములాంటిది. రాత్రి, పగలనక విధులు నిర్వహించాలి. ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ఫోన్‌కాల్ వస్తేచాలు క్షణాల్లో అక్కడికి చేరుకోవాలి. వారి ఆరోగ్య పరిస్థితిని అధికారులకు వివరిస్తూ ఆసుపత్రికి తరలిస్తాం. ఈ ఉద్యోగం చేయడం సంతృప్తినిస్తోంది. – కుమారస్వామి, పైలెట్ చెన్నూర్

నాట్య మయూరాలు

- నృత్యంలో రాణిస్తున్న చిన్నారులు
- మహా బృంద నాట్యంలో పాల్గొని గిన్నిస్ రికార్డు
- బాలకేంద్రం చిన్నారుల ప్రతిభ



గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువపత్రం, మెడల్



గిన్నిస్ రికార్డు సాధించిన బాలకేంద్రం చిన్నారులతో కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్: చిన్నారులు ఆయా వేదికల్లో శాస్త్రీయ నృత్యంలో ప్రతిభ కనబరుస్తున్నారు. అందులోనే రాణిస్తూ తమకంటూ ఓ ప్రత్యేకతను చాటుతున్నారు. వారే జిల్లా కేంద్రంలోని బాల కేంద్రంలో కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకుంటూ గిన్నిస్ రికార్డులకెక్కిన చిన్నారులు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియం వేదికగా భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 2023 డిసెంబర్ 24, 25వ తేదీల్లో కూచిపూడి కళా వైభవం –మహా బృందనాట్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 4,218 మంది నృత్యకారిణులు ఒకేసారి ప్రదర్శించి గిన్నిస్ రికార్డు సాధించారు. వారిలో బాల కేంద్రానికి చెందిన 26 మంది కూచిపూడి చిన్నారి నర్తకులు ఉండడం విశేషం.

గిన్నిస్ రికార్డు సాధించిన చిన్నారులు..

గడ్డం శ్రీనిధి, దువాస హర్షిని, పన్నాల లాస్య, ఠాకూర్ హర్షిని, అక్షర గీత, క్షీరసాగర్ జాహ్నవి, సన్నిధి దేశ్ముఖ్, కుర్ర భవిష్య, జాబు శ్రీ వర్ధిని, ఆర్. ఓజస్విని, నాలంవార్ మహాలక్ష్మి, గుండేటి అశ్విత, ఉపలంచివార్ అక్షిత, కొంకటీ ఐతీక్ష, పోలాజి ఉమారాణి, మోర శ్రేష్ఠ, సామ మహతి, చిలుక ఆమని, మామిడి అక్షయ, అవరగొండ సంజన, యానాకి నక్షత్ర, మచ్చ సాత్విక, కటకం భావనశైని, కొండ్ర అలేఖ్య, కానిందే మహాశ్రీ, రామోజీ రచన.

నాట్యశిఖామణి 'ఆమని'



కైలాస్‌నగర్ కాలనీకి చెందిన చిలుక వెంకటస్వామి–అన్నపూర్ణ దంపతుల కుమార్తె ఆమని 2021 నుంచి బాలకేంద్రంలో కూచిపూడి నృత్యంలో సర్టిఫికెట్ కోర్సు చేస్తూ ఎన్నో వేదికల్లో ప్రదర్శనలు ఇచ్చింది. అద్భుత కళా నైపుణ్యంతో అన్నమయ్య పురస్కారాన్ని సాధించింది. ఇప్పటివరకు 10 రికార్డులు సొంతం చేసుకుంది. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు ఈవెంట్లో పాల్గొని ధ్రువపత్రాన్ని అందుకుంది.

రాణిస్తున్న 'జాహ్నవి'



జిల్లా కేంద్రంలోని తిరుమలనగర్ కాలనీకి చెందిన కె.జాహ్నవి ఏడో తరగతి చదువుతోంది. 2022 నుంచి బాలకేంద్రంలో కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకుంటూ రాణిస్తోంది. చిన్ననాటి నుంచే నృత్యంపై ఆసక్తితో శిక్షణలో చేర్పించినట్లు తల్లిదండ్రులు సంజుతాయి– రవికుమార్ తెలిపారు. ఇప్పటివరకు ఆరు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడమే కాకుండా 7 రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో ప్రదర్శనలు ఇచ్చింది. మహారాష్ట్ర వార్ధాలో జరిగిన నృత్య పోటీల్లో పాల్గొని ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచింది. కళాశక్తి పురస్కారంతోపాటు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌లో పాల్గొని ధ్రువపత్రం అందుకుంది.

పురస్కారాల నిధి 'సన్నిధి'



టైలర్స్ కాలనీకి చెందిన దేశ్ముఖ్ కృష్ణమోహన్ –ఉమామహేశ్వరి దంపతుల కుమార్తె సన్నిధి కూచిపూడిలో రాణిస్తూ ఇప్పటివరకు 40 పురస్కారాలు అందుకుంది. ఇప్పటివరకు 16 రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో పాల్గొనగా అన్నింట్లో ప్రత్యేకతను చాటుకుంది. 2022 నుంచి శిక్షణ పొందుతూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఈవెంట్లో ధ్రువపత్రాన్ని అందుకుంది. భవిష్యత్తులో గొప్ప కూచిపూడి నాట్యకారిణిగా ఎదగాలని ఆకాంక్షిస్తుంది.

రికార్డుల 'హర్షిణి'



జిల్లా కేంద్రంలోని ఠాకూర్ ప్రదీప్ సింగ్– అనూష దంపతుల కుమార్తె హర్షిణి కూచిపూడి నృత్యంలో అరుదైన రికార్డులను సాధిస్తుంది. 2022 నుంచి ఇప్పటివరకు 11 అరుదైన రికార్డులు సొంతం చేసుకుంది. 2022లో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, 2023లో తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఫెంటాస్టిక్ అచీవ్మెంట్స్ అండ్ రికార్డ్స్, జీమ్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా రికార్డ్స్ దక్కాయి. ఇప్పటివరకు 40కి పైగా జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి వేదికలపై అద్భుత ప్రదర్శనలు ఇచ్చింది. తల్లి ప్రోత్సాహంతో రాణిస్తున్నానని హర్షిణి తెలిపింది.

శత జన్మదిన సందడి

- వాగ్దారిలో ఓ వృద్ధుడి వందో పుట్టినరోజు వేడుక



వేడుకల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

నేరడిగొండ: మండలంలోని వాగ్దారి గ్రామానికి చెందిన ఓ వృద్ధుడి శత జన్మదిన సంబురం కుటుంబ సభ్యులు, గ్రామస్తుల మధ్య ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బదావత్ కిర్యానాయక్ 1925 మే 24న జన్మించాడు. శనివారంతో వందేళ్లు పూర్తికాగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తుల సమక్షంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిర్యానాయక్ కేక్ కట్ చేశారు. తన ఆరోగ్యానికి జీవనశైలే కారణమని పేర్కొన్నాడు. కార్యక్రమంలో ఐదు తరాల వారసులు పాల్గొని సందడి చేశారు.

క్రిమిసంహారక నీటిని తాగి జీవాలు మృతి

కడెం: క్రిమిసంహారక నీటిని తాగి జీవాలు మృత్యువాతపడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దిల్దార్‌నగర్ గ్రామానికి చెందిన జక్కుల కొమురవెల్లి తన మేకలు, గొర్రెలను ఆదివారం తోకల రవీందర్ మొక్కజొన్న తోట సమీపంలోకి మేతకు తీసుకెళ్లాడు. అక్కడ ఉన్న క్రిమిసంహారక నీటిని తాగి ఆరు మేకలు, రెండు గొర్రెలు, ఒక మేక పిల్ల మృతి చెందింది. రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.